


https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
10 జనవరి 2026
సంపుటి 101
సంచిక 3
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com

### నదీ జలాలపై పంచాయతీ కాదు తెలంగాణకు

# నీళ్లు కావాలి

- చర్చల ద్వారానే జల వివాదాల పరిష్కారం
- రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ యూనిట్ ప్రారంభం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**రావిర్యాల, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**నదీ జలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే తెలంగాణ ప్రభుత్వ స్పష్టమైన విధానమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా? నీళ్లు కావాలా? అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లే కావాలని తాము కోరుకుంటామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఈ--సిటీలో ఏర్పాటు చేసిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలంగాణ ఎదుర్కొంటున్న జల వివాదాలపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. న్యాయస్థానాల ముందు పంచాయతీలు పెట్టుకునే కన్నా సమస్యలపై కూర్చొని చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. నీటి వివాదాల విషయంలో తెలంగాణ శాశ్వత పరిష్కారమే కోరుకుంటోందని, అభివృద్ధి సాధించాలంటే పక్క రాష్ట్రాలతో సయోధ్య, సహకారం తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. పాలమూరు--రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణ అనుమతులు, కేంద్ర జల కమిషన్ అనుమతుల్లో సమస్యలు

2లో

## కేసీఆర్ కలలు నేడు నిజమయ్యాయి

కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు
నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సందర్శించిన హరీష్‌రావు



**సిద్దిపేట, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**సిద్దిపేట జిల్లాలోని నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్దిపేట నియోజకవర్గం పూర్తిస్థాయిలో నూనె ఉత్పత్తి ప్రారంభించడం ఆనందకరమని అన్నారు. ఇది మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కలలు నేడు నిజమైన సందర్భమని పేర్కొన్నారు. రైతులకు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎన్నో చారిత్రక కార్యక్రమాలు అమలయ్యాయని హరీష్‌రావు గుర్తుచేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతుబంధు పథకాన్ని ఆపలేదని, రైతులకు నీళ్ల బాధ లేకుండా చేసిన ఘనత కేసీఆర్‌కే

2లో

### విద్యాసంస్థల భూముల రక్షణకు

## బీఆర్ఎస్ అండ

ఉర్దూ యూనివర్సిటీ భూములపై కాంగ్రెస్ కన్ను
అవసరమైతే ఢిల్లీలోనూ పోరాటం చేస్తా
మానూ విద్యార్థులతో కేటీఆర్ భేటీ



2లో

**హైదరాబాద్, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**నంది నగర్ నివాసంలో కేటీఆర్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాలభూమిని రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని విద్యార్థులు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. దేశంలో హైదరాబాద్‌కు తలమానికంగా ఉన్న ఏకైక ఉర్దూ సెంట్రల్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని విద్యార్థులు ఆరోపించారు. విశిష్టమైన విద్యాసంస్థను రియల్ ఎస్టేట్ అవసరాల కోసం వాడాలని చూస్తోందని, యూనివర్సిటీ భూములను గుంజుకోవడాన్ని ఒక ప్రక్రియలా కొనసాగిస్తోందని విమర్శించారు. గతంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన సుమారు 400 ఎకరాల భూముల

### దేశంలో తొలిసారి ఆన్‌లైన్‌లో సైబర్ నేర

## ఎఫ్ఐఆర్ నమోదు

హైదరాబాద్ పోలీసుల 'సీ-మిత్ర' వినూత్న కార్యక్రమం
ఇంటి నుంచే ఫిర్యాదు నుంచి ఎఫ్ఐఆర్ వరకు పూర్తి సహాయం





**హైదరాబాద్, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**దేశంలో తొలిసారిగా సైబర్ నేరాల బాధితులు ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేసుకునే వీలుగా హైదరాబాద్ పోలీసులు 'సీ--మిత్ర' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చేపట్టిన ఈ 'సీ--మిత్ర' వర్చువల్ హెల్ప్‌డెస్క్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయవచ్చు. డిజిటల్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో, సైబర్ నేరాల ఫిర్యాదు ప్రక్రియను సులభంగా, వేగంగా, పౌరులకు అనుకూలంగా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యంగా

2లో


### అటవీ సంరక్షణలో యువ ఐఎఫ్ఎస్ అధికారుల పాత్ర కీలకం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో మర్యాదపూర్వక భేటీ
అంకితభావంతో సేవలు అందించాలి: మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**తెలంగాణ క్యాడర్‌లో ఇటీవల నియమితులైన యువ ఐఎఫ్ఎస్ అధికారులు అటవీ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి గారు వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రకృతి పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర అత్యంత కీలకమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. అటవీ సంపదను కాపాడటంతో పాటు జీవ వైవిధ్యాన్ని సంరక్షించడంలో యువ అధికారుల కృషి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలవాలని ఆమె సూచించారు. అటవీ చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా అంకితభావంతో పనిచేయాలని యువ ఐఎఫ్ఎస్ అధికారులకు మంత్రి సూచించారు. అటవీ సంరక్షణను ప్రజా భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్లాలని, పర్యావరణ సమతుల్యతకు కట్టుబడి విధులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

### భారత్ వాతావరణ వేదిక-2026 ప్రారంభ సభలో ఉపరాష్ట్రపతి ప్రసంగం




2లో

- వాతావరణ చర్యలతో సమావేశక అభివృద్ధి
- పంచామృత ప్రతిజ్ఞలపై భారత్ నిబద్ధత

### హిమాచల్ ప్రదేశ్‌లో

## ఘోర రోడ్డు ప్రమాదం

లోయలోకి దూసుకెళ్లిన ప్రయాణికుల బస్సు
ఎనిమిది మంది మృతి, పలువురికి గాయాలు



2లో

# నదీ జలాలపై పంచాయతీ కాదు తెలంగాణకు నీళ్లు కావాలి

**మొదటి పేజీ తరువాయి** తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం కోసం పన్నెండు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే కనెక్టివిటీకి అనుమతులు కోరామని, ఈ అభివృద్ధికి పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి తెలంగాణ సహకారం అవసరమని, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో సహకార ధోరణిలో ముందుకు వెళ్లాలన్నదే తమ ఆకాంక్ష అని తెలిపారు. తెలంగాణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజిస్తూ అభివృద్ధి లక్ష్యాలు నిర్దేశించామని, తెలంగాణ రైజింగ్ 2047 దృష్టి పత్రాన్ని విడుదల చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీ పడే స్థాయికి తెలంగాణను తీసుకెళ్లాలన్న సంకల్పంతో యువ




పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు పారదర్శక విధానాలు రూపొందించామని, పారిశ్రామిక, విద్యుత్, పర్యాటక, దేవాదాయ, వైద్య రంగాల్లో కొత్త విధానాలు తీసుకొచ్చామని తెలిపారు. ఐటీ, ఫార్మా, గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాలు, డేటా కేంద్రాల రంగాల్లో తెలంగాణ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రైవేటు రంగంలో పెట్టుబడులు కీలకమని పేర్కొన్నారు. 1995 నుంచి 2025 వరకు ముప్పై ఏళ్ల నిరంతర శ్రమ ఫలితంగానే హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడగలుగుతోందని ముఖ్యమంత్రి అన్నారు. జర్మన్ సాంకేతిక పరిజ్ఞానంతో దక్షిణ భారతదేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీకి సంబంధించిన సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమని సుజెన్ మెడికేర్ యూనిట్‌ను ప్రశంసించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, శాసనమండలిలో చీఫ్ విప్ డా. పి. మహేందర్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కలలు నేడు నిజమయ్యాయి

**మొదటి పేజీ తరువాయి** దక్కుతుందని అన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఎరువులు, విద్యుత్ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. అయితే రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైందని విమర్శించారు. రైతులకు రోజుకు పన్నెండు గంటలకు మించి కరెంట్ రావడం లేదని, యూరియా కోసం యాప్‌లు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. వానాకాలం పంటకు రూ.600 కోట్ల బోనస్ పెండింగ్‌లో పెట్టారని, రెండు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారని మండిపడ్డారు. రెండేళ్లుగా పంటల బీమా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే సిద్దిపేట జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 8 వేల ఎకరాల నుంచి 80 వేల ఎకరాలకు పెరిగిందని హరీష్‌రావు చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో ఒక్క గజం కాలువ కూడా తవ్వలేదని, కావాలని రైతులపై కక్షతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల పట్ల చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. ఆయిల్‌పామ్ ప్రాజెక్టు వివరాలను వెల్లడిస్తూ, 2021 మార్చి 25న క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నామని, జూన్ 5, 2021న అశ్వారావుపేట నుంచి మొక్కలు తెచ్చి



నాటినట్లు తెలిపారు. నేడు జిల్లాలో 14,075 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు కొనసాగుతోందని, నర్మెటలో 65 ఎకరాల్లో రూ.300 కోట్లతో 2022 ఏప్రిల్ 13న ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం రోజుకు 3,500 గెలలను క్రషింగ్ చేస్తున్నామని, 600 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి అవుతోందని చెప్పారు. త్వరలోనే రిఫైనరీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హరీష్‌రావు ఆరోపించారు. సిద్దిపేట నియోజకవర్గంలోనే 22 వేల మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాలేదని తెలిపారు. రేవంత్ రెడ్డి ఫ్యాక్టరీ ప్రారంభానికి వస్తే, 22 వేల మంది రుణమాఫీ కాని రైతులతో కలిసి వచ్చి ప్రశ్నిస్తానని హెచ్చరించారు. రుణమాఫీ పూర్తయ్యే వరకు రైతులతో అక్కడే కూర్చుంటానని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు మాట తప్పారని విమర్శించారు. అశోక్‌నగర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఇచ్చిన హామీలపై రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని, నిజంగా చిత్తశుద్ధి ఉంటే అక్కడికి వెళ్లాలని హరీష్‌రావు సవాల్ విసిరారు.

### భారత్ వాతావరణ వేదిక-2026 ప్రారంభ సభలో

# ఉపరాష్ట్రపతి ప్రసంగం

**న్యూఢిల్లీ, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):** న్యూఢిల్లీలో నిర్వహించిన భారత్ వాతావరణ వేదిక–2026 ప్రారంభ సభలో భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ ప్రారంభ ప్రసంగం చేశారు. వాతావరణ పరిరక్షణ చర్యలు కేవలం పర్యావరణ రక్షణకే పరిమితం కాకుండా, సమావేశక ఆర్థిక అభివృద్ధికి, ఇంధన భద్రత బలోపేతానికి, భవిష్యత్తుకు సిద్ధమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి కీలక అవకాశంగా మారుతాయని ఆయన పేర్కొన్నారు. భారతదేశం చేపడుతున్న వాతావరణ పరిరక్షణ చర్యలు దేశ నాగరికతాత్మక విలువల్లోనే పాతుకుపోయి ఉన్నాయని ఉపరాష్ట్రపతి తెలిపారు. ప్రకృతితో సమతుల్యంగా జీవించాలనే భావన భారత సంస్కృతిలో అంతర్భాగమని, అదే ఆలోచన నేటి విధానాల్లోనూ ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రకటించిన పంచామృత ప్రతిజ్ఞల పట్ల దేశం సంపూర్ణ నిబద్ధతతో కొనసాగుతోందని ఉపరాష్ట్రపతి పునరుద్ఘాటించారు. ఉద్గారాల తగ్గింపు, పునరుత్పాదక ఇంధన వినియోగం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా భారత్ నిరంతరం ముందుకు సాగుతోందని వివరించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన శుభ్రమైన సాంకేతిక పరిజ్ఞానమే దేశ అభివృద్ధికి





ప్రధాన ఆధారంగా మారాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. స్వదేశీ సాంకేతికతతో దేశ అవసరాలనే కాకుండా ప్రపంచ అవసరాలను కూడా తీర్చే స్థాయికి భారత్ ఎదగాల్సిన అవసరం ఉందని, దేశంలో తయారీని ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిపే దిశగా ముందడుగు వేయాలని ఆయన స్పష్టం చేశారు.

### విద్యాసంస్థల భూముల రక్షణకు

# బీఆర్ఎస్ అండ

**మొదటి పేజీ తరువాయి** విషయంలోనూ ఇదే తత్వం కనబడిందని తెలిపారు. ఈ అంశంపై స్పందించిన కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సీరియల్ ల్యాండ్ స్నాచర్‌లా వ్యవహరిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విద్యా సంస్థల భూములను తీసుకుని రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరిగా పాలన సాగించడం దారుణమన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో సుప్రీంకోర్టు జోక్యం వల్ల తాత్కాలికంగా ఆగినా, పది వేల కోట్ల రూపాయల భూ కుంభకోణంపై ఇప్పటివరకు కేంద్రం విచారణ చేపట్టకపోవడం విచారకరమని అన్నారు. ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థుల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తిగా అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అవసరమైతే ఢిల్లీలోనూ పోరాటం చేస్తామని, రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తుతామని తెలిపారు. రాబోయే తమ ప్రభుత్వంలో యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన నిధులు కేటాయించి అండగా నిలబడతామని స్పష్టం చేశారు. మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ ఈ అంశంపై స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా మైనార్టీ విద్యార్థులు చదువుతున్న యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమేనా మీ సంరక్షణ అని ప్రశ్నించారు. భవిష్యత్ విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్న యూనివర్సిటీ భూములను ఖాళీగా చూపించి కబ్జా చేయడం విద్యా వ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు.

### దేశంలో తొలిసారి ఆన్‌లైన్‌లో సైబర్ నేర

# ఎఫ్ఐఆర్ నమోదు




**మొదటి పేజీ తరువాయి** అధికారులు తెలిపారు. 'సీ--మిత్ర' ద్వారా ఫిర్యాదును చట్టబద్ధమైన ఎఫ్ఐఆర్‌గా మార్చే ప్రక్రియ మొత్తం బాధితులకు పూర్తి స్థాయిలో సహాయం అందిస్తారు. సీ--మిత్ర విధానం ఇలా ఉంటుంది. ముందుగా బాధితులు జాతీయ సైబర్ నేర హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయవచ్చు లేదా సైబర్ నేరాల వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు. అనంతరం హైదరాబాద్ సిటీ పోలీసులకు చెందిన వర్చువల్ పోలీస్ అధికారులు ఫిర్యాదుదారుని సంప్రదిస్తారు. కృత్రిమ మేధస్సు ఆధారంగా న్యాయపరంగా సరైన ఫిర్యాదు ముసాయిదాను తయారు చేసి బాధితునికి పంపిస్తారు. ఆ ముసాయిదాను బాధితుడు ముద్రించి, సంతకం చేసి పోస్టు లేదా కొరియర్ ద్వారా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ బషీర్‌బాగ్కు పంపించాలి. ఇందుకోసం డ్రాప్‌బాక్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, నమోదు వివరాలను బాధితుడికి సందేశం ద్వారా తెలియజేస్తారు. పోలీసింగ్‌లో సాంకేతికతను వినియోగిస్తూ ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడమే హైదరాబాద్ సిటీ పోలీసుల లక్ష్యమని అధికారులు తెలిపారు. 'సీ--మిత్ర' ప్రారంభం సైబర్ భద్రతను పెంపొందించడంలో, ఆన్‌లైన్ మోసాలపై న్యాయం పొందడంలో కీలకమైన ముందడుగుగా నిలుస్తోందని

### హిమాచల్ ప్రదేశ్‌లో

# ఘోర రోడ్డు ప్రమాదం

**సిర్మౌర్, జనవరి 9(తరంగాలు ప్రతినిధి)** హిమాచల్ ప్రదేశ్లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోవడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద ఘటన శుక్రవారం మధ్యాహ్నం సిర్మౌర్ జిల్లాలోని రేణుకాజీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రయాణికులతో వెళ్తున్న బస్సు హరిపుర్ధార్ మార్కెట్ సమీపానికి రాగానే ప్రమాదానికి గురైంది. అదుపు తప్పిన బస్సు సుమారు 60 మీటర్ల లోతైన లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సంఘటన స్థలంలోనే ఏడుగురు మృతి చెందగా, చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందినట్లు సమాచారం. ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ బృందాలు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. లోయలో చిక్కుకున్న క్షతగాత్రులను బయటకు తీసి సమీప ఆసుపత్రులకు తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు, బస్సు అదుపు తప్పడానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. అతివేగం, రోడ్డు పరిస్థితులు లేదా సాంకేతిక లోపం కారణమా అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

## రాజ్‌గిర్ ఆర్టీసీలో 1340 మంది కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్

**రాజ్‌గిర్, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):** సీఆర్‌పీఎఫ్ రాజ్‌గిర్ రిక్రూట్ ట్రైనింగ్ సెంటర్‌లో 44 వారాల పాటు సాగిన కఠిన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 1340 మంది కానిస్టేబుల్ రిక్రూట్లు పాసింగ్ అవుట్ పరేడ్‌లో భాగమయ్యారు. ఈ ఘట్టం శిక్షణ పొందిన రిక్రూట్లకు, వారి కుటుంబాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ పాసింగ్ అవుట్ పరేడ్‌ను దక్షిణ జోన్ అదనపు డైరెక్టర్ జనరల్ సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అధికారి రవీదీప్ సింగ్ సాహీ సమీక్షించారు. పరేడ్ క్రమశిక్షణ, శిక్షణార్థుల సన్నద్ధత ఆయనను విశేషంగా ఆకట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కరాటే ప్రదర్శనలు, బైక్ స్టంట్లు ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. రిక్రూట్లు ప్రదర్శించిన శారీరక సామర్థ్యం, ధైర్యసాహసాలు శిక్షణ నాణ్యతకు నిదర్శనంగా నిలిచాయి. దేశ భద్రత పరిరక్షణలో కీలక బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమైన నూతన కానిస్టేబుళ్లకు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబ సభ్యుల సహకారం, త్యాగం కూడా ఈ విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. దేశ సేవలో వారు నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# రైతు పంట పండిస్తే లాభం ఎవరికీ?

- కష్టమంతా రైతుదే గిట్టుబాటు దూరమేనా?
- మధ్యవర్తుల చేతుల్లో మార్కెట్ వ్యవస్థ
- ధరల విధానం రైతును కాపాడుతోందా?

**డెస్క్, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**నమ్ముకుని జీవిస్తాడు. వానలు పడతాయా? విత్తనాలు పండుతాయా? తెగుళ్లు వస్తాయా? ధర వస్తుందా? అన్న అనిశ్చితి మధ్యే అతని జీవితం సాగుతుంది. కష్టపడి పంట పండించిన తర్వాత కూడా గిట్టుబాటు ధర దక్కకపోవడం రైతును తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. "పంట పండిస్తే లాభం ఎవరికీ?" అనే ప్రశ్న ఈ రోజు గ్రామాల నుంచి పట్టణాల వరకు ప్రతిధ్వనిస్తోంది.విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల ఖర్చులు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. సాగు వ్యయం పెరిగినా, పంటకు వచ్చే ధర మాత్రం అదే స్థాయిలో ఉండిపోతోంది. కొన్ని సందర్భాల్లో పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితులు రైతును అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, ప్రైవేట్ అప్పులు రైతు మెడకు బరువుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సాగు చేయడం లాభం కాదు, జీవన పోరాటంగా మారిందన్న వాస్తవం స్పష్టంగా కనిపిస్తోంది.మార్కెట్ వ్యవస్థలో మధ్యవర్తుల ఆధిపత్యం మరో పెద్ద సమస్యగా మారింది. రైతు పండించిన పంట నేరుగా వినియోగదారుడికి చేరేలోపు పలువురు దళారుల చేతులు మారుతోంది. ఈ క్రమంలో ధరలు పెరుగుతున్నా, ఆ లాభం రైతుకు చేరడం లేదు. వినియోగదారుడు అధిక ధర చెల్లిస్తున్నా, రైతు మాత్రం తక్కువ ధరకే పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది వ్యవస్థ లోపమా? లేక రైతును నిర్లక్ష్యం చేసే విధానమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మద్దతు ధరలు ఉన్నాయని చెప్పుకుంటున్నా, అవి క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్నది మరో సందేహం. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా తెరుచుకోవడం, సరైన మౌలిక వసతులు లేకపోవడం, కొలతల్లో తేడాలు, ఆలస్యం అయిన చెల్లింపులు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. పంట చేతికి వచ్చినా డబ్బు చేతికి రావడానికి నెలలు పడుతోందన్న వాపోళ్లు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మద్దతు ధరలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి.రైతు సంక్షేమం పేరుతో పథకాలు ప్రకటిస్తున్నా, వాటి ప్రభావం నేలమీద ఎంతవరకు కనిపిస్తోందన్నది చర్చనీయాంశమే. ఒకవైపు ప్రకటనలు, మరోవైపు రైతు జీవితం మధ్య అంతరం పెరుగుతోందన్న భావన బలపడుతోంది. పంట పండించడమే కాదు, దానికి న్యాయమైన ధర దక్కేలా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు కోరుతున్నాయి.చివరికి ప్రశ్న ఒక్కటే మిగులుతోంది. రైతు పంట పండిస్తే నిజంగా లాభం ఎవరికీ? రైతుకా, దళారులకా, మార్కెట్ శక్తులకా? రైతు బతుకును కాపాడాలంటే సాగు వ్యయం తగ్గించడం, న్యాయమైన ధరల వ్యవస్థ ఏర్పాటు చేయడం, మధ్యవర్తుల నియంత్రణ, పారదర్శక కొనుగోలు విధానాలు అమలు చేయడం అత్యవసరం. అప్పుడే రైతు పంట పండిస్తే లాభం తనకే అన్న నమ్మకం తిరిగి బలపడుతుంది.

## మోజెస్ పార్థీవ దేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జనవరి. 09, తరంగాలు:**కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో అమీనాపురం నందు క్రీస్తు విజయ సహవాసం చర్చ్ పాస్టర్ అడ్డాల మోజెస్ బుధవారం నాడు ప్రభువు నందు నిద్రించినారు. ఆ విషయాన్ని తెలుసుకున్న శుక్రవారం మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ చర్చికి వచ్చి పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించాడు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నజీర్, జడ్పీటీసీ శ్రీనాథ్ రెడ్డి, రాజమణి, యాకూబ్ రెడ్డి, సాయి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సామాజిక ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్



**ఖమ్మం జిల్లా బ్యూరో జనవరి 9 తరంగాలు :**అట్టడుగు వర్గాల అభ్యున్నతి అభివృద్ధి చదువుతోనే సాధ్యమని వారికి చదువు విలువ తెలియజేస్తూ అందరికీ పాఠాలు చెప్పిన తొలి సామాజిక ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ అని బీ సీ, ఎస్ సీ, ఎస్ టీ జిల్లా కార్యదర్శి సంగమేశ్వర రావు,వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి అన్నారు. శుక్రవారం రామన్నపేట లో సంఘం జిల్లా కార్యదర్శి షరీఫా బేగం ఆధ్వర్యంలో ఫాతిమా షేక్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ,నివాళులు లభించారు. అనంతరం కేక్ కట్ చేశారు. తదనంతరం జరిగిన సభలో ఉపేంద్ర బాయి మాట్లాడుతూ సత్య శోధక్ సమాజ్ వ్యవస్థాపక సభ్యురాలు ,చదువుల తల్లి సావిత్రిబాయి పూలే సహచరి అందరికీ చిరపరిచితురాలై న ఫాతిమా షేక్ ఆనాటి ముస్లిం సమాజం నుండి బడుగు బలహీన వర్గాల చదువుల ఆవశ్యకతను గుర్తించి ,సావిత్రిబాయి పూలే తో కలిసి ,మహిళలకు చదువులు చెప్పించిన ధన్యజీవి ఫాతిమా షేక్ అని కొనియాడారు. ఫాతిమా షేక్ తో పాటు సావిత్రిబాయి పూలే వంటి రోల్ మోడల్ గా నిలిచిన మహిళల స్ఫూర్తితో మన భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు పుల్లూరి నాగయ్య ,వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లాఉపా దక్షరాలు బి.జ్యోతి, ప్రధాన కార్యదర్శి స్పందన ,సహాయ కార్యదర్శి కవిత ,సలహాదారులు కే లక్ష్మి ,మహాలక్ష్మి ,రమ్య ,సరోజిని , కృష్ణవేణి, జిల్లా ఇన్చార్జి జాన్ బి ,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ , బహుజన జేఏసీ నాయకులు అర్జునరావు, వీరన్న ,వెంకన్న ,ఎల్ హెచ్ పీ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సిస్టమ్‌ను శుభ్రం చేసే రోజు వస్తుందా?




- మాటల్లో సంస్కరణలూ కార్యాలయాల్లో మాత్రం పాత పద్ధతులే
- లంచం లేకుండా పని జరగని పరిస్థితి
- నమ్మకం కోల్పోతున్న సామాన్యుడు

**డెస్క్, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):**దేశవ్యాప్తంగా వ్యవస్థపై ప్రజల అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోంది. చిన్న పని చేయించుకోవాలంటే లంచం ఇవ్వాల్సిన పరిస్థితి, హక్కు అడిగితే అవమానానికి గురయ్యే వాతావరణం ఇంకా కొనసాగుతూనే ఉంది. చట్టాలు కఠినంగా ఉన్నాయనే ప్రచారం ఉన్నా, వాటి అమలు మాత్రం భూమిపై కనిపించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిస్టమ్‌లో లోపాలే కాదు, లోపాల్ని అవకాశాలుగా మార్చుకున్నవాళ్లే పెరుగుతున్నారనే అభిప్రాయం బలపడుతోంది.ఎన్నికల వేళ ప్రతి ప్రభుత్వం వ్యవస్థను శుభ్రం చేస్తామంటూ హామీలు ఇస్తోంది. కానీ అధికారంలోకి వచ్చాక అదే సిస్టమ్‌లో సౌకర్యంగా కొనసాగుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. అవినీతి కేసులు బయటపడుతున్నా, విచారణలు సాగుతూనే ఉంటున్నాయి. తుది శిక్షలు పడకపోవడంతో తప్పు చేసినవారిలో భయం కనిపించడంలేదు. ఈ పరిస్థితి వ్యవస్థలోని లోపాలను మరింత బలపరుస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇదే సమయంలో సామాన్యుడి నమ్మకం తీవ్రంగా దెబ్బతింటోంది. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, న్యాయం కోసం సంవత్సరాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. నిజాయితీగా బతికేవారే శిక్ష అనుభవిస్తున్నారనే భావన పెరుగుతోంది. ఇది కేవలం వ్యక్తిగత సమస్యగా కాకుండా, ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.సిస్టమ్‌ను నిజంగా శుభ్రం చేయాలంటే ప్రకటనలు కాదు, కఠిన నిర్ణయాలు కావాలని ప్రజలు కోరుతున్నారు. విచారణలు వేగంగా పూర్తవ్వాలి. తప్పు చేసినవారికి రాజకీయ, అధికార అండలు లేకుండా శిక్షలు పడాలి. అప్పుడే వ్యవస్థపై నమ్మకం తిరిగి వస్తుంది. లేకపోతే "సిస్టమ్‌ను శుభ్రం చేస్తాం" అన్నది మరో నినాదంగానే మిగిలిపోతుందా? అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత పాలకుల మీదే ఉంది.

# ఐనవోలు జాతరకు పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలి

**ఐనవోలు జాతర ఏర్పాట్లను పర్యవేక్షంచి, పనుల పురోగతిని అధికారులతో సమీక్షంచిన హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**





**హనుమకొండ ప్రతినిధి, జనవరి 09,తరంగాలు:** ఐనవోలు జాతరకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లను పూర్తిచేసి జాతర విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.హనుమకొండ జిల్లా ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 13 నుండి ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆలయం వద్ద చేసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాదాయ, పంచాయతీ రాజ్, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, ఇతర శాఖల ఆధ్వర్యంలో ఇప్పటి వరకు చేసిన జాతర ఏర్పాట్లు, వాటి పురోగతి గురించి సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఐనవోలు మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతర ఏర్పాట్లు సంబంధిత శాఖలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన జిల్లా కలెక్టర్ కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారిని కలెక్టర్ దర్శించుకున్నారు. అర్చకులు శేష వస్త్రాలను అందించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షంచారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కమ్మగొని ప్రభాకర్ గౌడ్, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి కందుల సుధాకర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి రమాకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎస్సై పస్తం శ్రీనివాస్, ఏఈలు రవికుమార్, సురేష్ కుమార్, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కేసముద్రం మండలం కల్వల మోడల్ కళాశాల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు




**కేసముద్రం,ప్రతినిధి,జనవరి. 09, తరంగాలు:**సంక్రాంతి పండుగ సంబరాలు పురస్కరించుకొని శుక్రవారం కేసముద్రం మండలం కల్వల మోడల్ కళాశాల, పాఠశాల యందు సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో బాలికలకు ముగ్గుల పోటీ నిర్వహించడం జరిగింది ఈ ముగ్గుల పోటీలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు ఈ యొక్క ముగ్గుల పోటీలలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ముగ్గుల నైపుణ్యాన్నిశ్రీ చూపించడం జరిగినది మరియు భోగి మంటలు కార్యక్రమాన్ని పరిమి నవీన్ ప్రధానోపాధ్యాయులు ప్రారంభించడం జరిగినది ఈ భోగిమంటల కార్యక్రమాలు విద్యార్థిని విద్యార్థులు సంతోషంతో డ్యాన్సులు చేశారు తధానంతరం ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సంక్రాంతి పండుగ తెలుగు రాష్ట్రాలలో జరుపుకునే ముఖ్యమైన పండుగలలో ఒకటి అని ,సంక్రాంతి (మకర సంక్రాంతి) అనేది సూర్యుడు మకర (మకర)లోకి మారడాన్ని జరుపుకునే ఒక ముఖ్యమైన భారతీయ పండుగ. ఇది శీతాకాలం ముగింపును సూచిస్తుందనీ. ఇది పంట, శ్రేయస్సు అనగా పంటలు చేతికి వచ్చిన సందర్భంగా మరియు ఆధ్యాత్మిక పునరుద్ధరణను సూచిస్తుందనీ. గాలిపటాలు ఎగురవేయడం, నువ్వులు/బెల్లం స్వీట్లు పంచుకోవడం మరియు ఐక్యతతో మెలగడం మరియు ప్రకృతి ఇచ్చిన దాతృత్వానికి కృతజ్ఞతలు తెలియజేయడం లాంటి సంప్రదాయాలతో ఇది జరుపుకుంటారు అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతీ,సంప్రదాయాల కలయికే సంక్రాంతి

## పల్లవి మోడల్ స్కూల్ చైర్మన్ అశోక్ చారి





**పర్వతగిరి, జనవరి 05,తరంగాలు:** సంస్కృతీ,సంప్రదాయాల కలయికే సంక్రాంతి అని పల్లవి మోడల్ స్కూల్ చైర్మన్ అశోక్ చారి అన్నారు.పర్వతగిరి మండలం అన్నారం లోని పల్లవి మోడల్ స్కూల్ లో సంప్రదాయాలు ఉట్టిపడేలా ముందస్తు సంక్రాంతి సంబరాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. స్కూల్ చైర్మన్ అశోక్ చారి, కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కోటగిరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పర్వతగిరి ఎస్.ఐ. ప్రవీణ్, అన్నారం గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ ముఖ్యఅతిగా హాజరై విద్యార్థులతో కలిసి సంక్రాంతి పండుగ సంబరాల్లో పాల్గొని పిల్లలను ఉత్సాహపరిచారు.అనంతరం జోడెద్దుల బండి ఎక్కి సందడి చేశారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారులతో వివిధ కుల వృత్తులను ప్రతిబింబించేలా అలరించారు. అదేవిధంగా సంక్రాంతి పాటలకు ఆకట్టుకునే డ్యాన్స్ ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. రంగోళి పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.బాలురు తాడు గుంజుడు ఆటలో పాల్గొని తమ ఆనందాన్ని రెట్టింపు చేసుకున్నారు. సంప్రదాయాన్ని ప్రతిబింబించే ఎడ్ల బండి








ప్రదర్శన, బోగి మంటలు, గాలిపటాల ఎగరవేత వంటి కార్యక్రమాలు చిన్నారులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ ముందస్తు సంక్రాంతి సంబరాలు విద్యార్థుల్లో భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, పండుగల ప్రాముఖ్యతను తెలియజేసేలా ఉత్సాహభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను అతిథులు అభినందించారు.

# యువత క్రీడల్లో రాణించాలి

## సీఎం కప్ టార్చ్ రిలే ప్రారంభించిన ఎస్సై క్రాంతి కిరణ్




**కేసముద్రం, మహబూబాబాద్, జిల్లా, ప్రతినిధి, జనవరి. 09, తరంగాలు:** కేసముద్రం మండలంలో క్రీడా ప్రతిభను వెలికితీయడానికి యువత క్రీడల్లో రాణించాలని యువతకు, విద్యార్థిని, విద్యార్థులకు ఎస్సై క్రాంతి కిరణ్ టార్చ్ రిలే ప్రారంభిస్తూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సీఎం కప్ క్రీడలు రెండో సెషన్ లో భాగంగా సీఎం కప్ టార్చ్ రిలేని ఏర్పాటు చేశారన్నారు. క్రీడల పట్ల ఆసక్తి కలగడానికి, క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి సీఎం కప్ క్రీడలు ఇంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులకు నగదు పురస్కారం అందజేస్తూ ప్రోత్సహిస్తుంది అన్నారు. క్రీడల అభివృద్ధి కోసం స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ స్కూల్ లను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. గ్రామీణ యువతకు, విద్యార్థులుకు ఆ కళాశాలలు,పాఠశాలలో క్రీడల్లో రాణించడానికి,మెలుకువలు నేర్చుకోవడానికి..ఎంతో ఉపయోగపడతాయన్నారు. కాగా స్థానిక ఎంఈఓ మాట్లాడుతూ ఈనెల 8 వ తేదీ ఈ టార్చి రిలేని కలెక్టర్ కార్యాలయంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే ,కలెక్టర్ ఆధ్వర్యంలో టార్చ్ రిలే ప్రారంభించారు. సీఎం కప్ లాంటి క్రీడలు విద్యార్థి దశ నుండే క్రీడలను భాగం చేయడం ఉద్దేశంతో క్రీడలను ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం టార్చి రిలేని ఆర్టిఏ డైరెక్టర్ రావుల మురళి తీసుకొని, ఉత్సాహంగా కదిలారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించి పెద్ద ఎత్తున నిర్వహిస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రాజు, డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి నీలం దుర్గేష్, మేకల వీరన్న, దస్రూ నాయక్ , భూలోక రెడ్డి, బట్టు శ్రీనివాస్, అల్లం గణేష్, పందుల సారయ్య, డి వై ఎస్ ఓ ఓలేటి జ్యోతి, ఫిసికల్ డైరెక్టర్స్ కొమ్ము రాజేందర్, కొప్పుల శంకర్, దా మల్ల విజయ చందర్, కుమారస్వామి, కే పద్మ, స్రవంతి, రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

◆సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి
◆జాతీయ పెన్షన్ పథకం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి
◆ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమికోపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి
◆జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి
◆పాఠశాలల విలీనం, మూసివేతను నిలిపివేయాలి
◆తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్






**కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి, జనవరి. 09, తరంగాలు:** ఆల్ ఇండియా జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న 'ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణ' పోరాటానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ యు.ఎస్.పి.సి సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ పోరాటంలో భాగంగా నేడు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో కేసముద్రం మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు కూడా తమ తమ పాఠశాలల్లో జేబుకు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలపై తీవ్రమైన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా చేసిన విద్యా ప్రయోగాలు భవిష్యత్తు తరాలకు తీవ్రమైన అన్యాయం చేస్తాయనీ, ఉపాధ్యాయుల ఆత్మగౌరవం, హక్కులు, రిటైర్మెంట్ భద్రత, విద్యార్థుల భవిష్యత్తు అన్నీ ఒక్కటే నని, వీటిని రక్షంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందనీ అన్నారు.సర్వీసులో ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని,జాతీయ పెన్షన్ పథకం ఎన్ పి ఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ పునరుద్ధరించాలని ,ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమికోపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలనీ,జాతీయ విద్యా విధానం ఎన్ఈపిను రద్దు చేయాలనీ ,పాఠశాలల విలీనం, మూసివేతలను వెంటనే నిలిపివేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిటిఎఫ్ అధ్యక్షులు కీర్తి నాగయ్య మాట్లాడుతూఉపాధ్యాయులు పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని,రాష్ట్ర-జిల్లా-మండల శాఖలు ఇచ్చే పిలుపులకు తక్షణమే స్పందిస్తూ, రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా ఉద్యోగ ఉపాధ్యాయులందరికి సూచించారు. తదుపరి డ్యూటీ ఉపాధ్యక్షులు భూక్య శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయ సమస్యలను చర్చకు తీసుకుని నిర్ణయాత్మక చర్యలు తీసుకోకపోతే, పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయడం తప్ప మరో మార్గం లేదనీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టి పి టి ఎఫ్



అధ్యక్షులు గుండు సురేందర్ తో పాటు, యుటిఎఫ్ అధ్యక్షులు భూక్య శ్రీనివాస్, డిటిఎఫ్ అధ్యక్షులు కీర్తి నాగయ్య, టి పి టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, మండల కార్యదర్శి మోహన్ కృష్ణ, వీసం నర్సయ్య, ఊటుకూరి ప్రణయ్ కుమార్, ఉపాధ్యాయులు వెలమాల భాస్కర్, అప్పాల నాగరాజు, ఉప్పరపల్లి పి జి హెచ్ ఎం చంద్రశేఖర్, దురేష్, వినోద్ రాజ్, సంపత్, సురేష్, బిజయ్,తండాసదానందం,యం .యాకాంబ్రం, కె. రాములు ,రాము , అలీ ,శ్రీనివాస్, బాలాషారెడ్డి బిక్షపతి , లింగయ్య, నాగరాజు,నాగేందర్,హరికృష్ణ, ,కృష్ణ ,గోపి, రవీందర్,సూర్యనారాయణ శివ, పార్వతి తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్ పార్టీలో

# చేరిన పవన్ నాయక్



**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,జనవరి.నా9,తరంగాలు:** కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగింది.సబ్ స్టేషన్ తండాకు చెందిన కాంగ్రెస్ జిల్లా యువ నాయకుడు బాదావత్ పవన్ సుమారు 100 మంది తన అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కేసముద్రాన్ని మున్సిపాలిటీ చేయడంలో మొదటి అడుగులు తనతోనే పడ్డాయని పేర్కొన్నారు. కేసముద్రం మున్సిపాలిటీలో ప్రప్రథమంగా ఎగరనున్నది గులాబీ జెండా మాత్రమే అని శంకర్ నాయక్ తెలిపారు. సర్వేలన్నీ బీఆర్ఎస్ వైపే ఉన్నాయి అని తెలిపారు. 420 హామీలతో, ఆరు గ్యారంటీల గారడీలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు.అధికార పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీ చేరుతున్నారంటేనె అర్థం చేసుకోవాలి. ఈ ప్రభుత్వ పనితనం గురించి అని తెలిపారు. పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడాల్సిన అవసరం ఉంది. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ ముఖ్యమంత్రి అని, మున్సిపాలిటీలో గడపగడపకు మన కార్యకర్త తిరిగి ఈ బోగస్ ప్రభుత్వం చేసిన బోగస్ హామీలు వాళ్ళకి అర్థమయ్యే రీతిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రావులు రవి చందర్ రెడ్డి, ఊకంటి యాకుబ్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నజీర్, జడ్పీటీసీ శ్రీనాథ్ రెడ్డి, కముటం శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షులు కొమ్ములు, హరి నాయక్, రవీందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సట్ల వెంకన్న, ముత్యాల శివ కుమార్, గుగులోత్ వీరు నాయక్, నల్లా కిరణ్,సాయి కృష్ణ, రాహుల్, బద్రూ నాయక్, రేణుకుంట్ల సుధాకర్, తరాల వెంకన్న, నర్సింగము వెంకన్న, బానోత్ వెంకన్న, మున్సిపల్ నాయకులు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరం,కస్బా బజార్ లో డాకెట్ ప్రారంభం



**ఖమ్మం జిల్లా బ్యూరో జనవరి 09 తరంగాలు :** ఖమ్మం కస్బా బజార్ రామాలయం ఎదురుగా డాకెట్ డొమైన్ నూతన వస్త్ర దుకాణం ప్రారంభమైంది. టిఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు ఎందుకనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. మొదటగా షర్ట్ ను కొనుగోలు చేసి నిర్వాహకులు మహేష్, నరేష్, ఆనంద్, భరత్ లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,. షాప్ దినదిన అభివృద్ధి చెందుతూ నిర్వాహకులు వృద్ధిలోకి రావాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం బాధ్యులు కే.శేఖర్ పాల్గొన్నారు.

# సోషల్ మీడియా న్యాయస్థానమా?

- విచారణకు ముందే తీర్పులు
- ట్రెండ్స్ కోసం బలైపోతున్న నిజం
- డిజిటల్ గుంపుల చేతిలో న్యాయం బందీనా..?

**అమరావతి, జనవరి 9 (తరంగాలు ప్రతినిధి):** దేశంలో న్యాయం కోసం కోర్టులు ఉన్నా, తీర్పులు మాత్రం సోషల్ మీడియాలో వెలువడుతున్నాయా అనే ప్రశ్నలు బలపడుతున్నాయి. ఒక వీడియో, ఒక పోస్టు, ఒక హ్యాష్‌ట్యాగ్ చాలు నిందితుడిగా ముద్ర వేయడానికి. విచారణకు ముందే తీర్పులు, ఆధారాలకంటేభావోద్వేగాలకు ప్రాధాన్యం ఇవన్నీ సోషల్ మీడియాను న్యాయస్థానంలా మార్చుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఘటన ఏదైనా సరే, పూర్తి వివరాలు బయటకు రాకముందే అభిప్రాయాలు ఏర్పడుతున్నాయి. నిజానిజాలు తేలకముందే ట్రోలింగ్, బెదిరింపులు, క్యాంపెయిన్లు మొదలవుతున్నాయి. ఒకరి జీవితం మొత్తాన్ని క్షణాల్లో ధ్వంసం చేసే శక్తి ఇప్పుడు వైరల్ పోస్టుల చేతిలోకి వెళ్లింది. ఈ పరిస్థితిలో న్యాయ ప్రక్రియకు గౌరవం తగ్గుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఇదే సమయంలో ట్రెండ్స్ కోసం కొన్ని అంశాలను కావాలనే అతిశయోక్తిగా చూపిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. వీక్షణలు, లైకులు, షేర్ల కోసం నిజం పక్కకు నెట్టబడుతోందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో ఏర్పడే ఒత్తిడి కారణంగా అధికార సంస్థలు కూడా ఆతురతగా స్పందించాల్సిన పరిస్థితి వస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.సోషల్ మీడియా ప్రజల గొంతుగా ఉండాలి గానీ, న్యాయస్థానంగా మారకూడదన్నది నిపుణుల అభిప్రాయం.




అభిప్రాయం వ్యక్తం చేయడం హక్కే అయినా, తీర్పు చెప్పడం కోర్టుల పని. లేకపోతే న్యాయం డిజిటల్ గుంపుల చేతిలో బందీగా మారే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. చివరికి ప్రశ్న ఒక్కటే సోషల్ మీడియా నిజంగా న్యాయాన్ని కాపాడుతోందా? లేక న్యాయ ప్రక్రియను దెబ్బతీస్తోందా?

# కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం





**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జనవరి. 09,తరంగాలు:** శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ సయ్యద్ ఖలీద్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా సురేష్ నాయక్ ఆధ్వర్యంలో ఇటీవల రాహుల్ గాంధీ పై మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది...అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా సురేష్ నాయక్ మాట్లాడుతూ కేటీఆర్ రకుల్ రావు, ట్విట్టర్ టిల్లు నువ్వు రాహుల్ గాంధీ కాలిగోటికి సరిపోవు అంటూ వారు వ్యాఖ్యానించారు. 10 ఏళ్లుగా తెలంగాణ ప్రజల రక్తం తాగిన రాక్షసుడు మీరు... మిమ్మల్ని ఉరితీసి మా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కొడుతారని వారు హెచ్చరించారు...తెలంగాణ రాష్ట్రం మీ అయ్య జాగీరు కాదని... మరోసారి మా నాయకులపై చిల్లర మాటలు మాట్లాడితే మీ టిఆర్ఎస్ వాళ్లు రోడ్లమీద కూడా తిరగకుండా చేస్తామని సురేష్ నాయక్ హెచ్చరించారు...తెలంగాణ రాష్ట్రాన్ని పందికొక్కుల్లాగా దోచుక తిని తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ గారి కుమారుడిపై చిల్లర మాటలు మాట్లాడే కేటీఆర్ కు రాజకీయ భవిష్యత్తు లేదని నువ్వు జీవితంలో ముఖ్య మంత్రి కాలేవని వారు అన్నారు... మరోసారి మా నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మీ టిఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు... ఇకనైనా కేటీఆర్ బుద్ధి తెచ్చుకొని బాధ్యత గల ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి ఇలాంటి చిల్లర ప్రయత్నాలు బంద్ చేసి బాధ్యతగా ఉండాలని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు గార్లపాటి సాయి తేజ , జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబ్బేపల్లి శ్రవణ్,సోషల్ మీడియా అసెంబ్లీ అధ్యక్షులు రాకేష్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గాడిపల్లి చరణ్ గౌడ్, మహబూబాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాంపెల్లి నవీన్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గండు కార్తీక్ గౌడ్, ఆకుల సంతోష్,సురేష్, నరేష్, వీరన్న, శ్యామ్ యువత పాల్గొన్నారు

## అంగన్ వాడీ కేంద్రంలో యూనిఫాం అందజేత





**పాలేరు ఆర్సీ,09 జనవరి ( తరంగాలు) :** అంగన్ వాడీ కేంద్రాలలో ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని గైగొల్లపల్లి సర్పంచ్ బాదవతు అనుషా ఠ సైదులు అన్నారు. గైగొల్లపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం సర్పంచ్ అనుషా, ఉప సర్పంచ్ జిల్లా లింగయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ పుష్పలత, సెక్రెటరీ చంటి, స్కూల్ హెచ్ఎం ఆధ్వర్యంలో పిల్లలకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచులకు అంగన్వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో అంగన్ వాడీ కేంద్రాల బలోపేతంలో భాగంగా విద్యార్థులందరూ ఏకరూప దుస్తులతో ఉండాలనే ఉద్దేశంతో యూనిఫాం అందించిందని తెలిపారు. గ్రామంలోని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. అంగన్ వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందుతుందని తెలిపారు. విద్యార్థులకు మానసిక ఆనందం కోసం అనేక రకాల ఆటలు, పాటలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాలలో అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల పిల్లలకు పాఠశాల అంటే భయం పోతుందని తెలిపారు. ప్రాథమిక దశలో వారికి విద్యాబోధన సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పుష్పలత, గైగొల్లపల్లి సర్పంచ్ అనుష, ఉప సర్పంచ్ లింగయ్య ,అంగన్వాడి టీచర్లు గుగ్గిళ్ళ యశోద, టి పద్మ, ఏ బుబా, బి .శారదా, వి రుక్మిణి ,ఆయా రేణుక , గ్రామ దీపిక లలిత,అశాలు,ఏ ఎన్ ఎం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మోజెస్ పార్థీవ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మురళి నాయక్



**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,జనవరి. 09, తరంగాలు:** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో అమీనాపురం నందు క్రీస్తు విజయ సహవాసం చర్చ్ పాస్టర్ అడ్డాల మోజెస్ బుధవారం నాడు ప్రభువు నందు నిద్రించినారు. ఆ విషయాన్ని తెలుసుకున్న మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్,భూక్య.మురళి నాయక్ చర్చికి వచ్చి పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించి అడ్డాల మోజేష్ పాస్టర్ ఎంతోమంది అనాధలకు పేదలకు సహాయం చేసిన వ్యక్తి వారు ప్రభువు నందు ఐక్యమైన విషయం తెలియగానే చాలా బాధగా అనిపించింది. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ జీసస్ వేడుకుంటూ ఎల్లవేళలా ఈ చర్చికి వచ్చే పేదలందరికీ నా సహకారం ఉంటుందని చెప్పారు. వారి మరణం పట్ల ప్రగాఢ సంతాపం సానుభూతి తెలియజేయడం జరిగింది.పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ మేకల వీరన్న, ఆర్టిఏ మెంబర్ రావుల మురళి, నీలం దుర్గేష్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, భట్టు. శ్రీనివాస్ , బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలేపాక నాగరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆయుబ్ ఖాన్, యాదగిరి, బానోత్ బాలు నాయక్, తరాల వీరేష్ యాదవ్,కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, సామ .సుధాకర్, జన్ను కట్టయ్య, యార సాగర్, ఇనుముల కరుణాకర్, టౌన్ మహిళా అధ్యక్షురాలు ప్రభు రాణి, పోలేపల్లి వెంకట్ రెడ్డి, కత్తెరసాల శ్రీనివాస్, లాకావత్ బాలు నాయక్, వేల్పుగొండ ఏలియా, ఆరిద్రపు కుమారస్వామి, మిట్ట గడుపుల . యాకూబ్, రడం. శ్రీనివాస్, సప్పిడి గుట్ట జిపి ఉపసర్పంచ్ బానోతు రవి, సామ ప్రభాకర్, సంఘ.రమేష్ పాల్గొన్నారు.

## రవాణా మాసోత్సవాల అవగాహన ర్యాలీ




డిటిఓ జగదీష్,ఆర్టిఏ బోర్డు గజ్జెల్లి వెంకన్న, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్వర్ణలత

**ఖమ్మం జిల్లా బ్యూరో జనవరి 09 తరంగాలు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రవాణా మాసోత్సవాల సందర్భంగా ఖమ్మం జిల్లా రవాణా శాఖ కార్యాలయం నుండి కొత్త మున్సిపాలిటీ వరకు పాదయాత్రగా వెళ్తూ వాహనదారులకు నినాదాలు ఇస్తూ ప్రజలకు హెల్మెట్ ధరించి, సీటు బెల్టు పెట్టుకోవాలని ,మైనర్లకి వాహనాలు ఇవ్వరాదని,అతివేగంగా వాహనాలు నడప రాదని ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆర్టిఏ ఏవో సుధాకర్ ,స్టాఫ్ సీనియర్ అసిస్టెంట్ రత్నరాజు, సీతారాములు ,విజయలక్ష్మి ,కానిస్టేబుల్ రమేష్ ,సరిత ,ప్రసన్న,నీచాలా ,ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులు జిల్లా ఉపేందర్ ,కార్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ నాయకులు మస్తాన్,మధు ,ట్రాక్టర్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు రాందాస్, ఆటో యూనియన్ నాయకులు లక్ష్మణ్ ,ఉపేందర్, భాస్కర్ నాయకులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల భవనం ఏర్పాటు చేయాలి

జిల్లా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య



**ఖమ్మం జిల్లా బ్యూరో జనవరి 09 తరంగాలు :** దివ్యాంగులకు భవనం ఏర్పాటు చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల అధ్యక్షులు కుంచం ఉప్పలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులకు భవనం కావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును గతంలో కోరటం జరిగిందని, అందుకు వారు సానుకూలంగా స్పందించి 1000 గజాల స్థలం ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని జిల్లా దివ్యంగుల సంక్షమ అధికారిని విజేత అంతర్జాతీయ దినోత్సవ వేడుకలు నిర్వహించిన సందర్భంగాను జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ దృష్టికి తీసుకువెళ్లడంజరిగిందన్నారు.తెలంగాణా రాష్ట్ర దివ్యంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకొని అండగా ఉండాలని ఉప్పలయ్య విజ్ఞప్తి చేశారు.

# అధిక యూరియాతోనే తెగుళ్లు

### అవసరానికి మించి వాడితే నేల సారానికి నష్టం
### రైతులు ఆందోళన చెందవద్దు: వ్యవసాయ అధికారి వినయ్ కుమార్




**నర్సింహులపేట జనవరి 09 తరంగాలు:** పంటలకు అవసరమైనంత మెరకే యూరియా వాడాలని అధికంగా వాడితే తెగుళ్ల వ్యాధులు పెరుగుతాయని వ్యవసాయ శాఖ అధికారి వినయ్ కుమార్ హెచ్చరించారు. నర్సింహులపేట మండలంలోని వివిధ యూరియా పంపిణీ కేంద్రాలను ఆయన సందర్శించి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక యూరియా వాడకం వల్ల రసం పిలిచే తెగులు పెరగడమే కాకుండా నేల సారవంతం దెబ్బ తింటుందని, నేల చౌడుగా మారుతుందని తెలిపారు . దీంతోపాటు నీటి, వాయు కాలుష్యం కూడా పెరుగుతుందని అన్నారు. రైతులు యూరియా కొరతపై ఆందోళన చెందవద్దని, అవసరానికి మించి వినియోగించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద నాగారం సర్పంచ్ మందుల రఘు, భూక్య హరిలాల్,శేరి రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, గ్రూప్ నిర్వాహకులు మధు, వ్యవసాయం విస్తరణ అధికారులు శరత్, కళ్యాణి, జేపీవోలు పాల్గొన్నారు

## తెలంగాణ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్‌కు అండగా ఉంటా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి జనవరి 9 తరంగాలు ప్రతినిధి:** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో కల్వకుర్తి డివిజన్ యొక్క2026సంవత్సరం క్యాలెండర్ ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిఆవిష్కరించినారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూతెలంగాణమైనారిటీఉద్యోగుల.ఎల్లప్పుడు అండగా ఉంటానని.ఎలాంటి సమస్యవచ్చినాసమస్యలనుతీర్చడానికి ప్రయత్నం చేస్తానని చెప్పడం జరిగింది. కల్వకుర్తి.టీ.ఎస్.మీస. క్యాలెండరు ఇనాగరేషన్ చేసినందుకు.ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి. కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. తో పాటు కల్వకుర్తి ఎమ్మార్వో ఇబ్రహీం. రాష్ట్ర సెక్రటరీ తెలంగాణ పొల్యూషన్ బోర్డ్.మెంబర్ బాలాజీ సింగ్. మైనార్టీ ఎంప్లాయిస్. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్. సయ్యద్.ఖాదర్. ఆన్. రెబల్.ప్రెసిడెంట్. ఎం.డి. కరీం.కల్వకుర్తి డివిజన్ ప్రెసిడెంట్.అబ్దుల్. ఖలీల్. కాంగ్రెస్ పార్టీనాయకులు. బృంగి ఆనంద్ కుమార్. రేష్మ బేగం. టి. ఎస్.ఎం.ఎస్.ఏ.యూనియన్.నాయకులు.వైస్ ప్రెసిడెంట్. ఎండి ఫిరోజ్. జనరల్ సెక్రటరీ.దేవి ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్. ఎం.డిబర్కతుల్ల.ఎం.డి.ఖదీర్.అడ్వైజర్ సయ్యద్ కు ఖుర్షీద్ అలీవైస్ ప్రెసిడెంట్.ఎం.డి.అలీ. ఎండి ఫయాజ్.జరీనా బేగం. మైనార్టీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్‌యూపిపిటిఎస్ కాలమానిని ఆవిష్కరణ




**జఫర్గడ్ ప్రతినిధి, జనవరి 9,(తరంగాలు):** :రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్రం ఆర్ యూ పి పి టి ఎస్ సంఘం రాష్ట్ర, జిల్లా క్యాలెండర్ లను లిరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ములుకనూరి శంకర్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కొయ్యడ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జేరిపోతుల రవి తో జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా చేతుల మీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ భాషోపాధ్యాయులందరూ అభ్యసన అభివృద్ధి కార్యక్రమాన్ని పాఠశాలలో విజయవంతంగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారులు దైద రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెంబర్తి ప్రకాష్, ఉపాధ్యక్షులు బైరి నరేష్, బి. కృష్ణ, మహిళా కార్యదర్శి మంగ సునీత, ప్యాట ఎల్లయ్య, ప్రచార కార్యదర్శి బొడ్డు మల్లేష్, కార్యవర్గ సభ్యులు మాజోజు కృష్ణమూర్తి, వేణుమాధవ్, అజీజ్ పాషా, శారద తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు చెప్పుకుంటూ పోతే

# ఇంకో పార్టీకి భవిష్యత్తు ఉండదు

మధిర అభివృద్ధి చెందితేనే భవిష్యత్ తరాలకు మంచిది
మధిర నగరం క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలి అనుకునే వారినే గెలిపించుకోవాలి
మధిర మున్సిపల్ కీలక నాయకుల ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



**ఖమ్మం జిల్లా బ్యూరో జనవరి 09 తరంగాలు :** కాంగ్రెస్ పార్టీ చేసిన పనులు చెప్పుకుంటూ పోతే ఈ దేశంలో ఇంకో పార్టీ పుట్టేదే కాదు, మరో పార్టీకి భవిష్యత్తు ఉండేది కాదు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి లో కాంగ్రెస్ కీలక నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఇతర పార్టీలు రెండు మూడు దశాబ్దాల క్రితం చేసిన ఐదు లక్షల పనిని మైకు దొరికిన ప్రతిసారి చెప్పుకుంటూ పోతారు, కానీ కాంగ్రెస్ శ్రేణులు ప్రచారంలో వెనుకంజలో ఉండటం మూలంగా ఇబ్బంది ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మధిర మున్సిపాలిటీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా మధిర నగరానికి వచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం వంటి పథకాలను ప్రతి నాయకుడు రోజు పదిమందికి వివరిస్తే చాలని సూచించారు. మధిర పట్టణం అభివృద్ధి చెందాలి క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంటేనే భవిష్యత్తు తరాలు బాగుపడతాయని ఆలోచించే వ్యక్తులను గెలిపించుకోవాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. మధిర పట్టణానికి కాంగ్రెస్ చేయని పని అంటూ లేదు అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్తు, చెరువులను టూరిజం పార్కులుగా తీర్చిదిద్దడం, డిగ్రీ, ఇంటర్, హై స్కూల్ విద్యాసంస్థలకు సొంత భవనాలు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్, జనరల్ పాలిటెక్నిక్, ఐటిఐ ని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ గా మార్చడం, బస్టాండ్, ట్రెజరీ, బ్యాంకులను తీసుకురావడం వంటి గొప్ప పనులు చేసాం ఇవి మున్సిపాలిటీలోని ఓటర్లకు వివరించాల్సిన అవసరం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక మంచి ఇల్లు కట్టాలి అనుకున్నప్పుడు మొదట సిమెంటు, కంకర, ఇటుకలు ఎక్కడపడితే అక్కడ ఉంటాయి చిందరవందరగా కనిపిస్తుంది కానీ ఇల్లు పూర్తయిన తర్వాత అందంగా కనిపిస్తుంది అదే తరహాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి అది పూర్తయితే నగరం సుందరంగా మారుతుందని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తయిన చోట మట్టిని పూడ్చాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు



పూర్తయిన తర్వాత మధిర నగరం మొత్తంగా కొత్త సిసి రోడ్ల నిర్మాణం జరుగుతుందని వివరించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ద్వారా టాయిలెట్లలోని మురుగునీరు బయటకు వెళుతుంది, సీనరేజి ట్రీట్మెంట్ ప్లాంట్లలో ఆ మురుగునీటిని శుద్ధి చేసి బయటకు విడుదల చేస్తారు, వర్షం నీటిని ఏట్లోకి మళ్లించేందుకు ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థ ఉంటుందని వివరించారు. మధిర మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకొని అభివృద్ధి పనులు చేసుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు అభివృద్ధి పనులు జరిగితేనే మధిర పట్టణం అభివృద్ధి చెందుతుంది తద్వారా భవిష్యత్తు తరాలకు మంచి జరుగుతుందని వివరించారు.

# సకాలంలో బ్రెయిన్ అన్యూరిజం స్టెంటింగ్

### రోగి ప్రాణాలను కాపాడిన మలక్పేట యశోదా హాస్పిటల్ వైద్యబృందం



**ఖమ్మం జిల్లా బ్యూరో జనవరి 09 తరంగాలు :** ఖమ్మం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ మలకపేట యశోద హాస్పిటల్ కు చెందిన డాక్టర్ సూరిశెట్టి భరత్ కుమార్ ( కన్సల్టెంట్ న్యూరో ఫిజిషియన్ ) డాక్టర్. హరి కిషోర్ కామేపల్లి ( కన్సల్టెంట్ న్యూరో, ఇంటర్వెంషనల్ రేడియోలోజిస్ట్ ) ఎంఆర్.శ్రీనివాస్ చీదురా ( అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ ) సకాలంలో ట్రైఇన్ అన్యూరిజం జరిపించి ఒక మహిళ ప్రాణాలు కాపాడారు. ఖమ్మం ప్రాంతానికి చెందిన 46 సంవత్సరాల మహిళ 07 అక్టోబర్ 2025న తీవ్రమైన తలనొప్పి , వాంతులు , రెండు కళ్లలో మసక చూపు వంటి సమస్యలతో మలకపేట యశోద హాస్పిటల్ కి వచ్చారు . వెంటనే యశోద హాస్పిటల్ బృందం స్పందించి ఆమెకు ఎం ఆర్ ఐ బ్రెయిన్ చేయగా ద్విపాక్షక సబ్ ఆరాక్నాయిడ్ హేమరేజ్ ఉన్నట్లు తెలుసుకొని అత్యంత ప్రమాదకరంగా ఉండటంతో వెంటనే యశోదా హాస్పిటల్కి రిఫర్ చేశారు. యశోద హాస్పిటల్ లో అత్యవసర పరీక్షలు నిర్వహించగా సిరిబ్రల్ ఆంజియోగ్రామ్లో ఎడమ ఏ సి ఏ ఏ 1 సిగ్మెంట్లో చిన్న పరిమాణం , విస్తృతమైన మెడ కలిగిన సాక్యులర్ అన్యూరిజం ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది .అన్యూరిజం డోమ్ ఇంఫర మెడియల్లీ ఆంటీరియర్లీ వైపు ఉండగా సంబంధిత సెగ్మెంట్లో ఎక్టసినా (డైస్ప్లాసిస్ సూచన) కనిపించింది . ఎడమ ఏ సి ఏ ఏ 1, ఏ 2 సెగ్మెంట్ లో మోడరేట్ వసూస్పాజం ఉన్నప్పటికీ డిస్టల్ పెర్ఫ్యూషన్ సక్రమంగా ఉంది.రోగికి టైపు ×× డైబెట్స్ మెల్లిటస్ ,హైపరటెన్షన్ వంటి సహ వ్యాధులు ఉండటంతో కేసు అత్యంత క్లిష్టంగా పరిగణించబడింది . ఈ పరిస్థితి తక్షణ న్యూరో ఇంటర్వెన్షనల్ చికిత్స అవసరమని అందుబాటులో ఉన్న అత్యాధునిక న్యూరో సర్జరీ సదుపాయాలతో అనుభవజ్ఞులైన వైద్య బృందం తక్షణ అత్యవసర సేవలు అందించి రోగి ప్రాణాలను కాపడగలిగామని అన్నారు.ఇటువంటి అత్యంత క్లిష్టమైన బ్రెయిన్ అన్యూరిజం కేసులను కూడా విజయవంతంగా చికిత్స చేయగలుగుతున్నామన్నారు. అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు ఐసీయూ ఆధునిక న్యూరో ఇంటర్వెన్షనల్ మౌలిక సదుపాయాలు , న్యూరో ఇమేజింగ్ సాంకేతికత , అనుభవజ్ఞులైన అత్యవసర శస్త్రచికిత్స వైద్య బృందాలు మరియు 24/7 న్యూరో క్రిటికల్ కేర్ సేవలు యశోదా ఆసుపత్తుల అన్ని శాఖల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అకస్మాత్తుగా వచ్చే తీవ్రమైన తలనొప్పిని చాలాసార్లు సాధారణ సమస్యగా భావిస్తాం. కానీ కొన్ని సందర్భాల్లో అది తలనొప్పి, మెదడులో దాగి ఉన్న ప్రాణాపాయకరమైన సమస్యకు సంకేతంగా ఉంటుందన్నారు.అటువంటి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఒకటి బ్రెయిన్ అన్యూరిజం మెదడులోని రక్తనాళం బలహీనమై టెలూన్లా ఉబ్బి , ఎప్పుడైనా పగిలే ప్రమాదం ఉన్న స్థితి . బ్రెయిన్ అన్యూరిజం పగిలినప్పుడు మెదడులో అకస్మాత్తుగా రక్తస్రావం జరుగుతుంది . ఇది క్షణాల్లోనే స్ట్రోక్, శాశ్వత నర సంబంధిత లోపాలు, కోమా లేదా మరణానికి దారితీయవచ్చు . అలాంటి పరిస్థితుల్లో ఆలస్యం లేకుండా మెదడు స్కాన్లు చేయడం, ఖచ్చితమైన నిర్ధారణకు రావడం, వెంటనే సరైన శస్త్రచికిత్స చేయడం అత్యంత కీలకం .పగిలిన భారీ బ్రెయిన్ అన్యూరిజం , మెదడులో అక్యూట్ రక్తస్రావం ,అత్యవసర న్యూరో వాస్క్యులర్ పరిస్థితి . క్లిష్టతను దృష్టిలో ఉంచుకుని న్యూరో ఇంటర్వెన్షన్ బృందం అత్యవసర స్టెంటింగ్ చేయాలని నిర్ణయించింది. 09 నవంబర్ 2025న జనరల్ అనస్థీషియా ఇచ్చి పూర్తి జాగ్రత్తలతో లియో టీబీ బ్రేడెడ్ స్టెంట్ (3 ఇంటు 25 మి.మీ) ను ప్రాక్సిమల్ ఏ 2 నుండి ఏ 1 సిగ్మెంట్ వరకు అమర్చారు .స్టెంట్ అమర్చిన వెంటనే థ్రోంబోసిస్ కనిపించడంతో ఇంట్రా -ఆర్టీరియల్ టిలోఫిటోన్ ఇచ్చి నియంత్రించారు. తరువాతి ఆంజియోగ్రామ్లలో రక్తప్రవాహం సక్రమంగా పునరుద్ధరించబడి అన్యూరిజం స్థాయి తగ్గింది . అత్యవసర సిరిబ్రల్ ఆంజియోగ్రామ్ బ్రైడెడ్ స్టెంట్ (లియో బేబీ 3 ఇంటు 25 మీ.మీ) అమరిక , ఇంట్రా ఆర్టీరియెల్ టైరోఫిటన్ ద్వారా థ్రోంబోసిస్ నియంత్రణ ,డ్యూయెల్ యాంటీ ప్లేట్ లెట్ థెరపీ (యాస్పిరిస్ ం టెకాగ్రిలోర్)ఐ.సి.యు సబ్జెక్టివ్ కేర్, వెంటిలేటర్ సపోర్ట్,పి.ఆర్.బి.సి ట్రాన్స్ ఫ్యూజన్, యాంటీ పైలెప్టిక్స్ ,స్టాటిన్స్ ,డయాటెటిక్ వంటివి చికిత్సలో ప్రధానమైన అంశాలు అన్ని అన్నారు.ఇవి అత్యంత క్లిష్టమైన ప్రాణాపాయకరమైన బ్రెయిన్ అన్యూరిజం వంటి న్యూరో వాస్క్యులర్ అత్యవసర పరిస్థితులను కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు సహాయపడుతున్నాయని , నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు ,వ్యాధులకు కూడా చికిత్స అందుబాటులో ఉంటుందన్నారు.

## ఎన్పిఎస్,సిపిఎస్ లను రద్దు చేసి పాత పెన్షన్

# విధానాన్ని పునరుద్ధరించాలి

**టెట్ మినహాయింపు కోరుతూ ఫిబ్రవరి 5న ఢిల్లీలో మార్చ్ టు పార్లమెంట్**

**నల్లబ్యాడ్జీలతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనల తెలిపిన ఉపాధ్యాయులు**

**తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్**




**జఫర్గడ్ ప్రతినిధి, జనవరి 9,(తరంగాలు):** సీనియర్ ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుండి మినహాయించాలని, ప్రభుత్వ విద్యకు నష్టం కలిగించే జాతీయ విద్యా విధానం (ఎన్ఈపి) ని రద్దు చేయాలని, పాఠశాలల మూసివేత, విలీనాలను ఆపాలని, ఎన్పిఎస్, సిపిఎస్ లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రాథమిక ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని తదితర డిమాండ్లతో అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (ఎఐ జాక్టో) పిలుపు మేరకు దేశవ్యాప్త నిరసనలో భాగంగా జఫర్ గఢ్ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలహిమ్మత్ నగర్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో శుక్రవారం స్వల్ప విరామ సమయంలో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ మాట్లాడుతూ అల్ ఇండియా జాక్టో ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న ఢిల్లీలో నిర్వహిస్తున్న పార్లమెంటు మార్చ్ ను విజయవంతం చేయాలని కోరారు... టెట్ మీద సుప్రీంకోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలు గడిచినా కూడా కేంద్ర ప్రభుత్వం గానీ, జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సీటిఈ) గానీ ఏమాత్రం స్పందించకుండా మౌనంగా ఉండడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. 23 ఆగస్టు 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష మినహాయింపు ఇచ్చినట్లు నోటిఫికేషన్ లో పేర్కొన్న ఎన్సీటిఈ సుప్రీంకోర్టుకు ఆ విషయాన్ని తెలియజేయడంలో విఫలమైందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెండేళ్లలో టెట్ పాస్ కాకపోతే లక్షలాది ఉపాధ్యాయులు ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, వేలాది పాఠశాలలు మూతపడి, పేద పిల్లలకు విద్య దూరమయ్యే ప్రమాదం దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. విద్యా వ్యవస్థలో సంక్షభానికి కారణమైన సుప్రీంకోర్టు తీర్పుకు కేంద్ర ప్రభుత్వం ఎన్సీటిఈ ఈ రెండు బాధ్యత వహించాలని ఆయన అన్నారు. తక్షణమే కేంద్రం సుప్రీం కోర్టులో రివ్యూ లేదా క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయాలని, లేదా సీనియర్ ఉపాధ్యాయులకు రక్షణ కల్పించే విధంగా విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు అంతా నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలపారని, అదేవిధంగా అన్ని జిల్లాల నుండి రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి మెమోరాండంలు పోస్టు చేయాలని, ఫిబ్రవరి 5న ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఢిల్లీ వెళ్ళి పార్లమెంట్ మార్చ్ నిరసన ప్రదర్శనలో పాల్గొనాలని జయప్రకాశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పసునూరి కవిత, కడారి వసంత, గాదె వెంకట స్వామి, వెంగల జితేందర్, మోదుగ వనజాత, పొరిక మంజుల, భూక్యా వంశీకృష్ణ, మామూనూరి ప్రశాంత, దీకొండ మాధవి పాల్గొన్నారు.

## ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లకు

# ఆదాయ పరిమితి పెంచాలి



**జఫర్గడ్ ప్రతినిధి, జనవరి 9,(తరంగాలు):** అగ్రవర్ణాలలోని నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్నఈ డబ్యుఎస్ రిజర్వేషన్ల ఆదాయ పరిమితిని పెంచాలని ఆర్యవైశ్య సంఘంజిల్లా అధ్యక్షలు గంగిశెట్టి ప్రమోద్ కుమార్ డిమాండ్ చేసారు.శుక్రవారం జఫర్ గడ్ ఆర్యవైశ్య సంఘంహాలులో ఓసీ గరఅబశ్రీశ్రీన మహాసభకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండలశాఖ అధ్యక్షలు అంచూరి యుగందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుచూఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల కోసం అమలు పరుస్తున్న రిజర్వేషన్ లఆర్థిక పరిమితి 8 లక్షల వరకే ఉందనిఈ ఆదాయ పరిమితిని 15 లక్షల వరకు పెంచాలని కోరారు.ఈ డబ్యాఎస్ సర్టిఫికెట్ వయోపరిమితి1 సంవత్సరం నుండి 5 సంవత్సరాలకు పెంచాలని, ఓసీ సంక్షమం కోసం ప్రత్యేక కమీషన్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 11న రాష్ట్ర స్థాయి ఓసీ గరన మహాసభ ను హన్మకొండ లోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ లో నిర్వహిస్తున్నట్లు ప్రమోద్ కుమార్ తెలిపారు.ఈ గరఅబశ్రీశ్రీన సభలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దాంశెట్టి సోమన్న,ఇమ్మడి అశోక్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నింబధనల ప్రకారం

# వెనువెంటనే బిల్లులు చెల్లించాలి

**గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఎమ్మెల్యే మురళీ ఆదేశాలు.. ఒక్క లబ్ధిదారుడిని ఇబ్బంది పెట్టిన చర్యలు తప్పవు..**



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి,జనవరి. 0 9,తరంగాలు:** పేదోడి చిరకాల కోరిక సొంతింటి కళ .దీనికై రేవంత్ సర్కార్ అర్హులకు ఇందిరమ్మ ఇల్లు పథకం ను పారదర్శకంగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఎంపీడీఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం వెనువెంటనే బిల్లులు చెల్లించాలని ఎమ్మెల్యే మురళీ నాయక్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించారు.లబ్ధిదారులను అనవసరంగా ఇబ్బంది పెట్టే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎమ్మెల్యే మురళీ నాయక్ హెచ్చరించారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు న్యాయం జరగాలని, ఫైళ్లను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి అయ్యేలా పర్యవేక్షణ పెంచాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షమ పథకాలు పేదలకు పూర్తిస్థాయిలో చేరాలంటే అధికారులు బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే మురళీ నాయక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో హౌసింగ్ పీడీ,హౌసింగ్ డి,ఈ,హౌసింగ్ ఏఈలు,నియోజక వర్గ ఎంపిడిఓ లు, ఎంపీ వోలు పాల్గొన్నారు.

## కూనూరు పాఠశాలలో

# సంక్రాంతి సంబరాలు




**జఫర్గడ్ ప్రతినిధి, జనవరి 9,(తరంగాలు):** రేపటినుండి పాఠశాల సెలవులను దృష్టిలో ఉంచుకుని సంక్రాంతి పండగ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సీనియర్స్ మరియు జూనియర్స్ విభాగంలో ఈ పోటీలను నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పాఠశాలను అందమయిన ముగ్గులతో అలంకరించారు. ఈ సందర్భంగా విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వజ్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విఆర్ విద్యాసంస్థల బ్రోచర్ విడుదల చేసిన ఎమ్మెల్యే



**మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, జనవరి.09, తరంగాలు:** హైదరాబాద్ లోని మియాపూర్ కు చెందిన విఆర్ విద్యాసంస్థల బ్రోచర్ ని శుక్రవారం మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ విడుదల చేశారు. ప్రస్తుతం విద్యని వ్యాపారంగా చేస్తున్న కాలంలో విద్యా దానం సర్వదానాత్ ప్రధానం అని నమ్మే విఆర్ విద్యాసంస్థల చైర్మన్ రమేష్ పేద విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి ఒక రూపాయికి విద్యను అందించడం, ప్రతి ఒక్క వికలాంగ విద్యార్థులకి 50 శాతం రాయితీతో విద్యను అందించడం లాంటి విప్లవాత్మక ఆవిష్కరణలను అభినందించారు. కాలేజీలో ప్రవేశాలకు 9256925641 నంబర్ లో సంప్రదించాలని కళాశాల ప్రతినిధులు తెలిపారు.

# ప్రతి విద్యార్థి చదువుల్లో మెరుగ్గా ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ఐనవోలు లోని కేజీబీవీ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్**



**హనుమకొండ,జనవరి.09, తరంగాలు:** ప్రతి విద్యార్థి చదువులో మరింత మెరుగ్గా ఉండాలని, పాఠ్యాంశాల పైన పట్టు సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం( కేజీబీవీ )ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఎనిమిది, పదో తరగతి లను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. 8వ తరగతిలో పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థినుల విషయ పరిజ్ఞానంతో పాటు పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఆంగ్లంలో ఉన్న పాఠ్యాంశం తెలుగు వివరణ ను విద్యార్థినులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం స్టూడెంట్ వెల్నెస్ కార్యక్రమం గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఉపాధ్యాయినీలతో విద్యా బోధనకు సంబంధించిన అంశాలను గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ చదువుల్లో ప్రతి విద్యార్థి మెరుగ్గా ఉండేవిధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యాలయం ప్రాంగణంలోని వంటగదిని తనిఖీ చేశారు. విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. మెనూ ప్రకారం ప్రతిరోజు భోజన పదార్థాలను చేస్తున్నారా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఎంఈఓ పులి ఆనందం, కేజీబీవీ ప్రత్యేక అధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

